
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
ఆదివారం 02 - 03 - 2025

# ఘనంగా ఎస్‌సిటి ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్

అనంతపురం, మార్చి 1 (అనంత ప్రభ)

అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 394 ఎస్‌సిటి ఎస్సైల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెూంశాఖామాత్యులు శ్రీమతి వంగలపూడి అనిత గారు, రాష్ట్ర డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్య అతిథులుగా పాల్గొని ఎస్‌సిటి ఎస్సైలకు దిశానిర్దేశం చేశారు.

రాష్ట్ర హెూంశాఖామాత్యుల ప్రసంగం :

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో... డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్త గారి సారథ్యంలోని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ తన మెరుగైన పనితీరుతో ప్రజలను ఆకట్టుకుంటోంది. నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణ మొదలుకొని అనేక కఠిన సవాళ్లను ఎదుర్కొని ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో పోలీస్ శాఖ కృషి ఎనలేనిది. అందుకు ముందుగా డిజిపి గారిని మరియు పోలీస్ శాఖను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. అంతటి గొప్ప శాఖకు నేను హెూం మంత్రిగా ఉన్నందుకు గర్వపడుతూ, ఇంతటి అద్భుతమయిన అవకాశాన్ని నన్ను నమ్మి ఇచ్చిన ముఖ్యమంత్రి గారికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

ఈరోజు 394 మంది సబ్-ఇన్ స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పెరేడ్ కు ముఖ్య అతిథిగా హాజరైనందుకు చాలా సంతోషంగా ఉంది. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్న నూతన సబ్-ఇన్ స్పెక్టర్లందరికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

ఈరోజు మీ జీవితంలో ఒక ముఖ్యమైన రోజు. పోలీస్ శాఖలో కీలకమయిన అధికారాలు, భాధ్యతలు కలిగిన సబ్- ఇన్ స్పెక్టర్లుగా మీరు ప్రవేశిస్తున్నారు. పోలీసు ఉద్యోగం మిగతా ఉద్యోగాల వంటిది కాదు. ఇందులో మీరు 24 గంటలు, వారానికి 7 రోజులు విధులలో ఉంటారు. మీకు కావలిసిన గుణాలు నిజాయితీ, నిష్పక్షపాతం, బాధితులపట్ల సానుభూతి, విధిపట్ల నిబద్ధత. గౌరవప్రదమైన ఈ ఉద్యోగంలో మీరు సమాజాన్ని సుస్థిరంగా ఉంచి శాంతిభద్రతలు కాపాడే కీలక బాధ్యతలు కలిగి ఉంటారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించి, నేరాలను కట్టుదిట్టంగా అరికట్టడానికి, అలాగే చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయడానికి మీరు సమర్థవంతంగా పనిచేయాల్సిన ఆవశ్యకత వుంది.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, బాధితులకు న్యాయం చేయడం ద్వారానే వారికి భరోసా కలుగుతుంది. అప్పుడే మీరు మీ వృత్తికి న్యాయం చేసినవారవుతారనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఈ ఉద్యోగం మీరు అహర్నిశలు ఎంతో శ్రమించి, పగలు రేయి కష్టపడి సాధించారు. ఈ డ్యూటీని నిజాయితీగా, సమర్థవంతంగా నిర్వర్తించడంతోపాటు ప్రజలకు నిష్పక్షపాతంతో కూడిన సేవలను అందించాలి. నూతనంగా సబ్- ఇన్ స్పెక్టర్లుగా శిక్షణ పూర్తిచేసుకున్న మీలో 97 మహిళా సబ్- ఇన్ స్పెక్టర్లు ఉండటం సంతోషంగా వుంది. మరి ఈ క్రమంలో రాష్ట్రంలో ఈ మధ్య కాలంలో మహిళలపై దాడులకు తెగపడుతున్న సంఘటనలు చూస్తున్నాం. మహిళలు, చిన్నారులపై ఏ చిన్న నేరం జరగకుండా వారిని కాపాడే బాధ్యత మనందరిపైనా ఉంది.

పోలీసు వ్యవస్థలో సిబ్బంది కొరతను దృష్టిలో పెట్టుకొని న్యాయపరమైన సమస్యల వలన ఆగిపోయిన కానిస్టేబుల్ నియామక ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసి 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేస్తాము. పోలీసు వ్యవస్థలో అన్ని స్థాయిలలోని సిబ్బందికి సకాలములో పదోన్నతులు ఇవ్వడం ద్వారా వారిలో నూతన ఉత్తేజాన్ని నింపి ఆత్మవిశ్వాసముతో పనిచేసే వాతావరణాన్ని కల్పించి పోలీసు వ్యవస్థ ప్రతిష్టను పెంపొందించుటకు కృషి చేస్తున్నాము.

దేశంలోనే మునుపెన్నడూ లేని విధంగా బ్యాంకు ఖాతాల ద్వారా పోలీసు సిబ్బందికి ఉచిత ప్రమాద భీమా



ఒక కోటి రూపాయలు, హెూంగార్డులకు రూ. 30 లక్షలు, మానిటరీ ప్రయోజనం కల్పించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల మెరుగైన ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాం.

నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మన ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం రాష్ట్రంలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది అందరూ ఇదే లక్ష్యంతో పనిచేసి రాష్ట్రానికి మంచి పేరు తీసుకు వచ్చేందుకు కృషి చేయాలి. పోలీసుశాఖకు ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం అందిస్తాం. ప్రతీ పోలీసు అధికారి, చట్టాల మీద సమగ్ర అవగాహన కలిగి ఉండి శాంతి భద్రతల అమలులో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజలకు నిరంతర రక్షణ అందించాలి. మన రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ మరియు బలహీన వర్గాల సంక్షేమం కోసం పెద్దపీట వేసింది. మీరు ఈ వర్గాలకు అండగా ఉంటూ వారి హక్కుల పరిరక్షణకు ప్రత్యేకంగా కృషి చేయాలి. అనునిత్యం ప్రజలతో మమేకమై జవాబుదారీతనంతో మీరు విధులు నిర్వర్తించాలి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త క్రిమినల్ చట్టాలు సమాజములోని మార్పులకు అనుగుణంగా మార్చబడ్డాయి. ఈ చట్టాలు ప్రజలకు న్యాయాన్ని అందించడములో, ప్రజల భద్రతను పెంపొందించడములో మరియు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రయోజనకరంగా ఉన్నాయి. ఈ కొత్త క్రిమినల్ చట్టాల పట్ల మీరు సంపూర్ణ పరిజ్ఞానం, అవగాహన కలిగి ఉండాలి.

పోలీసు సంక్షేమములో భాగంగా రాష్ట్ర పోలీసు శాఖలో పనిచేయుచున్న ప్రతి ఉద్యోగికి, శాఖపరంగా వారికి రావాలిసిన ఆర్థిక ప్రయోజనాలను సకాలములో అందేటట్లు మన ప్రభుత్వం కృషి చేస్తుంది.

రాష్ట్ర డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా ప్రసంగం :

ఈరోజు మీకు మరుపు రానిది. పాసింగ్ అవుట్ పరేడ్ అనేది ముఖ్యమైన ఘట్టం. శిక్షణ పూర్తీ చేసుకుని సమాజంలోకి అడుగిడుతున్నారు. ఈరోజు ప్రతిజ్ఞ చేసిన విషయాలలో నిష్పక్షపాతంగా, నిర్భయంగా మరియు రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తామని ప్రమాణం చేశారు. ఈరోజు నుండీ పదవీ విరమణ పొందే వరకు ఈ ప్రతిజ్ఞలోని అంశాలను మరువకూడదు. మానవ హక్కులను కాపాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు అనుగుణంగా పని చేయడాన్ని ఎప్పుడు మరువకూడదు. చట్టపరంగా పని చేయాలి. పోలీసు సేవలు అవసరమైన వారి పట్ల మరింత సానుభూతితో ఉండాలి. మారుతున్న నేరాలకు అనుగుణంగా మనము అప్ డేట్ అయ్యి వాటిని ఛేదించాలి. ప్రస్తుతం సైబర్ నేరాలు విస్తృతమయ్యాయి. ఈ నేరాలకు కారణాలేవైనా కట్టడి కోసం ప్రతీ జిల్లాలోను సైబర్ స్టేషన్ ఏర్పాటుకు కృషి జరుగుతోంది. మహిళలు, చిన్నారులు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకుంటున్నాము. సైంటిఫిక్ ఎయిడ్స్ లను వినియోగించి కేసుల దర్యాప్తుల్లో నాణ్యతను పెంచి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేస్తున్నాము. ముఖ్యంగా ప్రజలకు జవాబుదారీతనంగా ఉండటం, చివరి వరకు నిజాయితీగా, అంకితభావంతో పారదర్శకంగా విధులు నిర్వర్తించడం ప్రతీ పోలీసుకు ముఖ్యం. శాంతిభద్రతలను కాపాడుకోవడం ద్వారా మన రాష్ట్ర అభివృద్ధికి మనం తోడ్పడతామని విశ్వసిస్తున్నాను.



ఈ ప్రభుత్వం ఏర్పాటైన రోజు నుండే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చింది. ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సెల్ సిస్టం అమలు చేస్తోంది. మంచి స్పందన లభిస్తోంది. 52 శాతం మంది మహిళలు పిటీషనర్లుగా వస్తున్నారంటే పోలీసుశాఖ, ప్రభుత్వంపై విశ్వాసం పెరిగినట్లేనని అవగతమవుతోంది.

డ్రోన్ టెక్నాలజీ - ఆడియో-మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం ద్వారా ఏజెన్సీ ప్రాంతాలలో గంజాయి సాగుతో సహా వివిధ నేరాలపై నిఘా మరియు ట్రాఫిక్‌ను ప్రత్యక్షంగా పర్యవేక్షించడానికి డ్రోన్‌లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. పోలీసింగ్ సామర్థ్యాన్ని మరియు ప్రభావాన్ని మెరుగుపరచడానికి లైవ్ ఫింగర్ ప్రింట్ స్కానర్లు, బాడీ-వోర్న్ కెమెరాలు, డిజిటల్ మొబైల్ రేడియో రిపీటర్లు మరియు మ్యాన్‌ప్యాక్‌లను మోహరిస్తున్నారు.

ఈనేపథ్యంలో ప్రజలు, పోలీసు శాఖ, ప్రభుత్వం మీపై చాలా నమ్మకం ఉంచారు. అందరూ వారి అంచనాలకు అనుగుణంగా పనిచేయడానికి కృషి చేయాలి, అంకితభావం మరియు జవాబుదారీతనంతో పనిచేయాలి.

అనంతరం ...శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాలలో రాణించిన, ప్రతిభ కనపరిచిన శిక్షణార్థులకు రాష్ట్ర హెూంశాఖామాత్యుల చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైనింగ్స్ విభాగం ఐజిపి కె.వి మోహన్ రావు ఐపీఎస్, ఏపీఎస్పీ బెటాలియన్స్ విభాగం ఐజిపి రాజకుమారి ఐపీఎస్, కర్నూలు డిఐజి కోయ ప్రవీణ్ ఐపీఎస్, అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీ పి జగదీష్ ఐపిఎస్... ఎస్పీలు వి.రత్న ఐపిఎస్, రాధిక ఐపీఎస్, మీనా ఐపీఎస్, తాడిపత్రి ఏ ఎస్ పి రోహిత్ కుమార్ చౌదరి ఐపిఎస్... ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ , ఎమ్మెస్ రాజు, పల్లె సింధూర రెడ్డి, పిటిసి కోర్స్ డైరెక్టర్ మల్లికార్జున వర్మ, పలువురు అదనపు ఎస్పీలు, డిఎస్పీలు సిఐలు, ఆర్ ఐ లు, ఎస్సైలు, ఆర్ ఎస్ ఐ లు, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ 94.వర్ధంతి ఘనంగా వేడుకలు

- సమగ్రాభివృద్ధి ప్రజా సంక్షేమానికి భరోసా
- కూటమి హామీలు అమలుకి మార్గ నిర్దేశనం చేసేలా బడ్జెట్ నిర్ణయం
- ఉరవకొండ జనసేన పార్టీ ఇంచార్జ్ గౌతమ్ కుమార్

ఉరవకొండ, మార్చి 1 (అనంత ప్రభ)

కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శు క్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఉరవకొండ నియోజవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి గౌతం కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ఉంది. అందుకు అనుగుణంగా కేటాయింపులు ఉన్నాయి. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసింది. భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉ పముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు తగ్గించే చర్యలు చేపట్టింది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పంచాయతీరాజ్ శాఖకు పెద్ద ఎత్తున నిధులను, అన్నదాత సుఖీభవ, పేదలకు ఆరోగ్య బీమా, పింఛన్ల పెంపుదల, దీపం 2 పథకాలకు నిధుల కేటాయింపుతోపాటు మిగిలిన సూపర్ సిక్స్ పథకాల హామీలను తప్పకుండా నెరవేరుస్తామని బడ్జెట్ కేటాయింపుల ద్వారా నిరూపించుకున్నామన్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని ఈ ఏడాది మే నుంచి అమలు చేసేందుకు రూ. 9,407 కోట్లను కేటాయించారు, అన్నదాతలకు భరోసా నిచ్చేలా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ రూపొందించిన ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు రైతాంగానికి మేలు చేసే బడ్జెట్ ప్రవేశపెట్టిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ శాఖల



అధికారులకు ఈ సందర్భంగా గౌతంకుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఉన్న పంచాయతీరాజ్ శాఖకు ఈ బడ్జెట్ లో రూ. 18 వేల కోట్లు కేటాయించినందుకు ఆర్థిక మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియచేస్తున్నాం. ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గ్రామాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్ నెట్వర్క్ పెంచే ప్రయత్నం మొదలు పెట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా 4,300 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రాగా, ఇప్పటికే 3 వేల కిలోమీటర్ల మేర యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేశారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రవేశ పెట్టిన ఈ బడ్జెట్ ని జనసేన పార్టీ పక్షాన, శ్రీ పవన్ కళ్యాణ్ తరపున స్వాగతిస్తున్నాం" అన్నారు

## గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం పకడ్బందీగా అమలు చేయాలి
## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్

అనంతపురం, మార్చి 1 (అనంత ప్రభ)

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డిస్టిక్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ( గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం మెరుగైన అమలు కోసం) జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని స్కాన్ సెంటర్లను పకడ్బందీగా తనిఖీ చేయాలన్నారు. అలాగే ఒక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని, గర్భస్థ పిండ లింగం నిర్ధారణ నిషేదిత చట్టము మరియు స్కాన్ సెంటర్లు లేదా డయాగ్నస్టిక్ సెంటర్లు లింగ నిర్ధారణ చేసినట్లయితే ఈ సమాచారాన్ని ఈ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ప్రజలు తెలియజేయాలని, అటువంటి వారి ఫోన్ నెంబర్లు, చిరునామా గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేయాలని ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం జిల్లాలో పకడ్బందీగా అమలు పరిచే విధంగా యంత్రాంగం పలు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఈ చట్టంపై ప్రజలకు వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యతను తెలియ పరచాలని, ముఖ్యంగా సోషల్ మీడియాని సంపూర్ణంగా వినియోగించుకోవాలన్నారు. అలాగే ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులలో ఈ చట్టంపై అవగాహన కోసం బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ లింగ




నిర్ధారణ పరీక్షలు జరపకూడదని, చట్టం అతిక్రమిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే లింగ నిర్ధారణ కోసం ప్రయత్నించినా, లేదా ప్రోత్సహించనా అట్టివారిపై కూడా చర్యలు తప్పవన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఈబి.దేవి, ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డా. దుర్గేష్, డిస్టిక్ ట్రైనింగ్ సెంటర్ డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. సూర్యనారాయణ రెడ్డి, ఐ. అండ్. పీఆర్ డిఐపిఆర్ఓ గురుమూర్తి శెట్టి, డెమో త్యాగరాజ్, తదితరులు పాల్గొన్నారు

## పింఛన్ల పంపిణీలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం, మార్చి 1 (అనంత ప్రభ)

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ 3 లక్షల 22వేల కోట్ల రూపాయలతో బడ్జెట్ ప్రవేశపెట్టారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నియోజకవర్గంలోని రుద్రంపేట పంచాయతీతో పాటు పలు కాలనీల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం నుంచి ఆయన ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ దారులనడిగి వారి స్పందనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకం పింఛన్ల పెంపు పైన చేశారన్నారు. పింఛన్లు అందుకుంటున్న వారిలో సంతోషం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇచ్చిన



హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఇందులో భాగంగానే బడ్జెట్ కూడా అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎక్కువ ప్రాధాన్యమించినట్లు దగ్గుపాటి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## మద్దతు ధర కల్పించి కందులను కొనుగోలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

కూడేరు, మార్చి 1 (అనంత ప్రభ)

కుడేరు మండలం లో రైతులు ఖరీఫ్ 2024 సీజన్ లో 3724 హెక్టార్లలో అనగా 9128 ఎకరాల్లో కంది పంటను వర్షాధారంగా సాగు చేసారు. ఆగష్టు సెప్టెంబర్ నెలలో ఒక మోస్తరుగా కురిసిన వర్షాలవల్ల కంది ఎకరానికి 3 నుండి 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ మరియు ఏపీ మార్కుఫెడ్ ద్వారా కంది విత్తన సేకరణ క్వింటాలుకు 7550/- మద్దతు ధర ప్రకటించి గత నెలలో సేకరణకు పచ్చజెండా వూపడంతో మండలం లో ఇంతవరకూ 420 మంది రైతు సోదరుల నుండీ 4200 క్వింటాళ్ల కందులను సేకరించడం జరిగింది. సుమారుగా 70శాతం రైతుల అకౌంట్లకు సొమ్ము జమచేయడం జరిగింది.

ప్రస్తుతం కంది సేకరణలో కూడేరు మండలం జిల్లాలో 6



స్థానం లో వున్నది. ఇంకా కంది రైతులు ఎవరైనా వున్నట్లయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కూడేరు మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ మరియు ఏ ఇ వో శైలజ తెలియచేస్తున్నారు.

## సాకే శైలజనాథ్ ను కలిసిన నాగులగుడం దాసరి.వెంకటరమణ

శింగనమల, మార్చి 1 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా కేంద్రంలో వైసీపీ నాయకులు సాకే శైలజానాథ్ నివాసంలో వైసిపి నాయకుడు దాసరి వెంకటరమణ కలిశారు అనంతరం వారు మాట్లాడుతూ సింగనమల మండల కేంద్రంలో వైసీపీ నాయకుల పరిస్థితి మరి దారుణంగా ఉందని కనీసం తమ జగన్ మాజీ ఎమ్మెల్యే ల ఫ్లెక్సీలు కూడా కట్టుకొని పరిస్థితులలో ఉ న్నామని అన్నారు అలానే మండలంలో రాజకీయాలు అనేక కోణాలలో ఉన్నాయని సాకే శైలజానాథ్ తో సంభాషించారు

ఇలాగైతే వైసీపీ నాయకులు కార్యకర్తలు అని చెప్పుకోవడానికి కూడా మండలంలో భయపడే పరిస్థితి ఉందని ఎలాగైనా శైలజనాథ్ సింగనమలలో



పర్యటించాలని ఇది నాయకులు కార్యకర్తలలో ధైర్యాన్ని నింపాలని తెలిపారు

ఈ కార్యక్రమంలో దాసరి వెంకటరమణ పెద్దిరెడ్డి సుబ్బరాయుడు శరత్ ఆది ప్రభాకర్ అశోక్ శ్రీనివాసులు శివ తదితరులు పాల్గొన్నారు

## పింఛన్ల పంపిణీ పరిశీలించిన ఆర్డీఓ కేశవ నాయుడు




శింగనమల, మార్చి 1 (అనంత ప్రభ)
మండల పరిధిలోని నాగులగుడ్డం తండా గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఆర్డీఓ కేశవ నాయుడు పరిశీలించారు. ఈ తనిఖీలో తహసిల్దార్ బ్రహ్మయ్య., ఎంపీడీఓ భాస్కర్. పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీలో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో అందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సజావుగా సాగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు



కూడేరు, మార్చి 1 (అనంత ప్రభ)
కూడేరు మండలం స్థానిక మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల నందు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలకు ఆత్మకూరు జూనియర్ కాలేజ్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రం నందు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం రోజున సజావుగా సాగాయి. కూడేరు కేజీబీవీ పాఠశాల నందు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మొత్తం 39 మంది విద్యార్థినిలు ఉండగా మొత్తం 39 విద్యార్థినిలు పరీక్షలకు హాజరైనట్లు కేజీబీవీ ఎస్ ఓ ఉమాదేవి తెలియజేశారు.

## టీడీపీ కార్యకర్త భార్య మృతికి సంతాపం తెలిపిన యువనేత..



పామిడి, మార్చి 1 (అనంత ప్రభ)
పామిడి పట్టణ టీడీపీ మాజీ టౌన్ కన్వీనర్ బొమ్మ మోహన్ కృష్ణ సతీమణి శ్రీమతి సరళ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదం లో మరణించిన విషయం తెలుసుకున్న గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గుమ్మనూరు ఈశ్వర్ పామిడి పట్టణం బొమ్మ మోహన్ కృష్ణ ఇంటికి వెళ్లి ఆయన సతీమణి శ్రీమతి సరళ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సరళ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి ని తెలిపారు. అనంతరం బొమ్మ మోహన్ కృష్ణ కి ధైర్యంగా ఉండాలని మీకు అండగా టీడీపీ పార్టీ మరియు మేము అండగా ఉన్నామని తెలిపారు.. ఈ కార్యక్రమం లో పామిడి పట్టణ మరియు మండల కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీమతి సరళ మృతికి సంతాపం తెలియజేశారు..

## చట్టం దృష్టిలో అందరూ సమానులే నా?!



ఉరవకొండ, మార్చి 1 (అనంత ప్రభ)
చట్టం దృష్టిలో అందరూ సమానులే అంటారు కానీ ఉరవకొండ న్యాయస్థానం దృష్టిలో అందుకు భిన్నంగా జరుగుతోంది. కోర్టు హాలు భవనాన్ని ఇటీవల ఎయిర్ కండిషనింగ్ చేశారు. దీనితో న్యాయవాదులు ఉక్కబోతకు గురికాకుండా చల్లని వాతావరణం లో ఉంటున్నారు. అయితే కచ్చితంగా మాత్రం ఉక్కబోతకు గురికాక తప్పలేదు. కోర్టు ప్రవేశ ద్వారం వద్ద ఫ్యాన్లు బిగించకపోవడంతో కచ్చిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విపరీతమైన ఎండవేడిమికి, ఉక్కపోతకు గురవుతున్నట్లు బాధితులు తెలిపారు. న్యాయమా నీవు ఎక్కడా అని ప్రశ్నిస్తున్నారు? న్యాయవాదులకు సౌకర్యాలు, కచ్చిదారులకు అసౌకర్యాల అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. సూర్య తాపం ఎండ వేడిమి అందరికీ ఒకేలా ఉంటుంది.. కక్ష దారులు అసౌకర్యాలకు గురికాకుండా తక్షణమే ఫ్యాన్లు బిగించాలని కోరుతున్నారు.

## హెూలీ పేరుతో బజారులో డబ్బులు వసూలు కూడదు.



ఉరవకొండ, మార్చి 1 (అనంత ప్రభ)
సింధు నాగరికత నుంచి మొదలైన బంజారాల సంస్కృతి సాంప్రదాయాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నదని నేటికీ ఆదర్శవంతమైన వని కాబట్టి నేటి తరం వారు బంజారా సంస్కృతిని సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని బంజారా సంఘం ప్రతినిధి నంగారేర్ నాయక్ ఎస్ కే సుబ్రహ్మణ్యం నాయక్ పేర్కొన్నారు శుక్రవారం పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రస్తుతం హెూలీ పండుగ పేరుతో మహిళలు గుంపులు గుంపులుగా బజారులో తిరుగుతూ హెూలీ కానుకలు ఇవ్వాలని బలత్కారం చేయడం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు బజారులో తిరగడం వల్ల బంజారాల మనుగడ దిగజారుతుందని గౌరవం తగ్గుతుందని పండుగల పవిత్రత కనుమరుగవుతున్నదని ఆరోపించారు గతంలో దేశ సంరక్షణ సౌభ్రాతృత్వానికి పాటుపడిన బంజారాల గొప్పతనాన్ని ఇనుమడింప చేయాల్సిన తరుణంలో కొందరు పెట్రోల్ బంకు వద్ద బజారులో హెూలీ పేరుతో డబ్బులు వసూలు చేయడం మంచిది కాదని వారిచే ఐదు పది రూపాయలతో జీవితం ముందుకు సాగదని గతంలో మన పూర్వీకులు కష్ట కాలాలలో కూడా ఇలాంటి చర్యలు కు పాల్పడు లేదని ఉన్నదానితో సంతృప్తికరంగా సంతోషంగా ఐక్యంగా పండుగలు జరుపుకున్నారే కానీ డబ్బులు వసూలు చేయలేదని గుర్తు చేశారు కాబట్టి ప్రస్తుతం విద్యావంతులైన మనం నాగరిక సమాజంలో అనుసరించాల్సిన నాగరిక చర్యలకు గౌరవించాలని అనాగరిక చర్యలకు పాల్పడి బంజారాల కొండే గౌరవాన్ని తగ్గించకూడదని విజ్ఞప్తి చేశారు

## ధర్మవరంలో 35 కోట్లతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు - మంత్రి సత్య కుమార్ యాదవ్

- క్లస్టర్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించిన అధికారులు
- ఎన్నికల హామీని నిలబెట్టుకుంటోన్న మంత్రి సత్యకుమార్



ధర్మవరం, మార్చి 1 (అనంత ప్రభ)
ధర్మవరంలో 35 కోట్ల రూపాయలతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ధర్మవరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో హ్యాండ్లూమ్ జెడి రాజారావు, మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, ఆర్డిఓ మహేష్, ఎమ్మార్వో నటరాజ్, మరియు ఇతర అధికారులు కలిసి శనివారం స్థల పరిశీలన చేసి ప్రాజెక్ట్ కు సంబంధించిన అన్ని ప్రణాళికలను సమీక్షించారు. ఎన్నికల సమయంలో ధర్మవరానికి మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తానని హామీఇచ్చిన మంత్రివర్యులు ప్రస్తుతం ఆ హామీ నెరవేర్చే విధంగా అడుగులు వేస్తున్నారు. గత జులై నెలలో క్లస్టర్ ఏర్పాటుకు కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ని కలసి ధర్మవరంలో చేనేత రంగం అభివృద్ధి కోసం మెగా క్లస్టర్ ఏర్పాటుకు సహకారం అందించాలని కూడా కోరారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు హ్యాండ్లూమ్ జేడీ స్థల పరిశీలనకు ధర్మవరంకు రావడంతో నేతన్నల కలలు త్వ-రలోనే సాకారమవనున్నాయి. ఈ సందర్భంగా ఇన్చార్జి హరీష్ బాబు మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా హ్యాండ్లూమ్ పరిశ్రమకు పునరుద్ధరణ, మరింత అభివృద్ధి సాధన లక్ష్యంగా పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని,
ఈ మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ప్రాజెక్ట్ ద్వారా, స్థానిక కూలీలకు శ్రమావకాశాలు పెరిగే అవకాశం ఉన్నదని, అలాగే దేశ వ్యాప్తంగా మరియు అంతర్జాతీయంగా హ్యాండ్లూమ్ ఉత్పత్తుల మార్కెట్‌ను పెంపొందించడమే లక్ష్యం అని తెలిపారు. ప్రాజెక్ట్ ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు మంచి ప్రోత్సాహం లభించనుందని ఆయన అన్నారు. ఈ క్లస్టర్ నిర్మాణం పూర్తి అయిన తరువాత, ధర్మవరం ప్రాంతం హ్యాండ్లూమ్ పరిశ్రమలో దేశంలోనే ఒక ప్రముఖ కేంద్రంగా మారనుందని చెప్పారు. మంత్రివ-ర్యులు సత్య కుమార్ గారు వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాల్లో తీరికలేకుండా ఉన్నప్పటికీ ధర్మవరం అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచిస్తూ ఉన్నారని, ముఖ్యంగా ఎన్నికల హామీలను నిలబెట్టుకొనే విధంగా అడుగులు వేస్తున్నారని ఆయన వివరించారు.

## ఎంబిబిఎస్ (మెడిసిన్ లో) డిగ్రీ పట్టా పొందిన బోయ సుకన్య

- క్లస్టర్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించిన అధికారులు
- ఎన్నికల హామీని నిలబెట్టుకుంటోన్న మంత్రి సత్యకుమార్



కూడేరు, మార్చి 1 (అనంత ప్రభ)
కూడేరు మండలం మండల కేంద్రానికి చెందిన బోయి నరసింహులు కూతురు సుకన్య తను బీద కుటుంబంలో జన్మించి తల్లిదండ్రుల పరిస్థితులను గుర్తించి చిన్ననాటి నుండే చదువుపై ఆసక్తితో విద్యను అభ్యసిస్తూ అంచలంచెలుగా ఎదుగుతూ ఎంబిబిఎస్ లో (డిగ్రీ) పట్టాను పొంది అందరికీ ఆదర్శంగా నిలిచింది. తల్లిదండ్రులు ఆమెను ఎలాగైనా ఉన్నత చదువులు చదివించాలని సంకల్పానికి ఆమె గట్టి పట్టదలతో బీద పరిస్థితుల మధ్య కడప ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మెడిసిన్ లో సీటును సాధించి డిగ్రీ పట్టాను పొందడంతో తల్లిదండ్రులు ఎంతోగానో సంతోషించారు. ఒకవైపు తల్లిదండ్రుల బీద పరిస్థితి మరోవైపు ప్రస్తుత పోటీ ప్రపంచంలో మెడిసిన్ లో సీట్ సాధించడమే కష్టంగా ఉన్న తరుణంలో గట్టి పట్టదల కృషితో విద్యను అభ్యసించి మెడిసిన్ లో సీటును సాధించి ఎంబిబిఎస్ పట్టా పొందారు. తమ కుటుంబం బీద పరిస్థితుల వల్లనే గట్టి పట్టుదల కృషితో ఎంబిబిఎస్ లో పట్టా సాధించానని ఆమె అన్నారు. నేను ఉన్నత స్థాయికి ఎదగడానికి నా తల్లిదండ్రులే ఆదర్శమని ఆమె అన్నారు. చిన్ననాటి నుండి నా చదువు వెనకాల నా తల్లిదండ్రులు ప్రోత్సాహం కృషి ఎంతో ఉందని వారి ప్రోత్సాహం వల్లనే ఎంబిబిఎస్ లో (డిగ్రీ ) పట్టా పొందడంతో ఆమె తల్లిదండ్రులను మరియు తనకు విద్యను అభ్యసించిన గురువులను గుర్తు చేసుకున్నారు

## రైతుల పాదయాత్ర పోస్టర్స్ విడుదల



ఉరవకొండ, మార్చి 1 (అనంత ప్రభ)
ఈ నెల 7 న అనంతపురం జిల్లా కలెక్టర్ ఆఫీస్ వరకు జరిగే రైతుల పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికలను రైతు సంఘం నేతలు శనివారం విడుదల చేశారు.
ఉరవకొండ రెవెన్యూ కార్యాలయం నందు ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ మధుసూదన్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి శ్రీనివాసులు కౌలు సంఘం అధ్యక్షులు రంగారెడ్డి రైతు సంఘం నాయకులు మురళి రవి వీరాంజనేయులు జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు జిల్లా ఉపాధ్యక్షులు విరుపాక్షి రైతు సంఘం నాయకులు సీనప్ప సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు మార్చి 7న ఉరవకొండలో ప్రారంభమై కలెక్టర్ ఆఫీస్ వరకు పాదయాత్ర జరుగుతుంది. 10వ తేది కలెక్టర్ ఆఫీస్ వద్ద జరుగు ధర్నాలో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ
కౌలు రైతులు :- మిరప. పత్తి, పప్పుశనగ పండించిన పంటలను అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించి, కౌలురైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏడు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కు అందజేశా-రు..

1) అన్ని పంటలకు గిట్టుబాటు ధర కలిపించాలి. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి.

2) ప్రభుత్వమే మిర్చి దబ్బిరకం, కడ్డీ రకానికి క్వింటా 50, వేలతో సింజెంటా, ఇతర రకాల మిరప 25 వేలతో కొనుగోలు చేయాలి.

3) 2024-25. ఖరీఫ్ రబీలో నష్టపోయిన పంటలకు పంట నష్టపరిహారం ఇన్సూరెన్స్ ప్రకటించాలి.

4) నష్టపోయిన మిర్చి రైతులకు ఎకరాకు లక్ష రూపాయలు పరిహారం ప్రకటించాలి.

5) సీడ్ జొన్నకు క్వింటా 5వేలు మద్దతు ధర ప్రకటించాలి, కంపెనీలు దళారులు లేకుండా రైతులతో నేరుగా కొనే విధంగా చర్యలు తీసుకోవాలి.

6) పప్పు సెనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా 10వేల తో కొనుగోలు చేయాలి.

7) షరతులు లేకుండా క్వింటా పత్తి 10వేలతో కొనుగోలు చేయాలి

రైతుల ఏడు డిమాండ్ల పరిష్కారం కోసం తలపెట్టిన పాదయా-త్రను జయప్రదం చేయాలని నాయకులు కోరారు.

## చలివేంద్రాల ఏర్పాటు మరిచారా?! చలివెంద్రాల ఏర్పాటులో చోద్యం చూస్తున్న పంచాయితీ.





ఉరవకొండ, మార్చి 1 (అనంత ప్రభ)
ఉరవకొండ జనాభా 55 వేలు ఉంది. కొండ ప్రాంతం కావడంతో విపరీతమైన ఎండ వేడిమి భరించలేకపోతున్నారు. టవర్ క్లాక్ చుట్టూ చిరు వ్యాపా-రస్తులు తోపుడుబండ్లపై కాయగూరలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఎండ వేడిమి సైతం లెక్కచేయకుండా పొట్టకూటి కోసం జీవనం సాగిస్తున్నారు. వాటర్ బాటిల్లు కొనలేని పరిస్థితి వారిది.
పంచాయతీ అధికారులు పాలకవర్గం ముక్కు పిండి సుంకాలు వసూలు చేస్తోంది. వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారు. సరి కదా తాగునీటి సౌకర్యం కల్పించలేక పోయారు. పంచాయితీ అధికారులు చలివేంద్రాల ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం,ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.
స్థానిక టవర్ క్లాక్ నుంచి సిండికేట్ బ్యాంకు దాకా, అలాగే ఎస్ కే ఆర్ క్లబ్ వరకు, టవర్ క్లాక్ నుంచి చర్చి కూడలి వరకు, చర్చ కూడలి మలుపు నుంచి పాత స్టేట్ బ్యాంకు వరకు, పాత బస్టాండు నుంచి గుంతకల్ బస్తా వరకు, రాధా బజారులో రోడ్లకు ఇరువైపులా జీవనం సాగిస్తున్నారు. చలివేంద్రాల ఏర్పాటుతో వారికి దాహార్తి తీర్తుంది.
సూర్యతాపం అధికమయ్యింది. ఎండలు భగభగమంటున్నాయి. చలివేంద్రాల ఏర్పాటుకు అటు పంచాయతీ అధికారులు, ఇటు స్వచ్ఛంద సేవకులు సైతం స్పందించలేదు. కేవలం పత్రికా ప్రకటనలకు ఫోటోలకు ఫోజులు ఇచ్చి కాలం వెలిబు చ్చుతున్నారు.

ఎస్ కే ఆర్ క్లబ్ వారు, లయన్స్ క్లబ్బు గారు, జై కిసాన్ ఫౌండేషన్ ఇతర సంస్థల వారు పత్రికా ప్రకటనలు, ఫోటో ఫోజులకు పెద్ద బిల్డప్ ఇస్తుంటారు. అయితే చలివేంద్రల ఏర్పాటుకు ఎందుకు స్పందించడం లేదో అర్థం కాని ప్రశ్న. అభివృద్ధి కాముకులు స్పందించి తక్షణమే చలివేంద్రాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## డీజీపీని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



అనంతపురం, మార్చి 1 (అనంత ప్రభ)
అనంతపురం రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తాతో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భేటీ అయ్యారు. ఎస్ఐల పాసింగ్ పరేడ్ ఔట్ కార్యక్రమం సందర్భంగా డీజీపీ అనంతపురం వచ్చారు. ఈ నేపథ్యంలో పీటీసీలో డీజీపీని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి ఆయన కలిశారు. నియోజకవర్గంలో శాంతి భద్రతల సమస్యలతో పాటు పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. పోలీసుల సమస్యలతో పాటు సిబ్బందిని పెంచే అంశంపై ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి తీసుకెళ్లిన అంశాలపై డీజీపీ సనుకూలంగా స్పందించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో తమ వైపు నుంచి పూర్తి సహకారం ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూమ్ శాఖ మంత్రి ని కలిసిన గుమ్మనూరు నారాయణ




అనంతపురం, మార్చి 1 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సోదరుడు గుత్తి మండలం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ రు అనంతపురం పట్టణం నందు మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు స్వగృహం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూమ్ శాఖ మంత్రివర్యులు శ్రీమతి వంగలపూడి అనిత ని గుమ్మనూరు నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బిజెపి కార్యకర్తలు జనసేన సైనికులు పాల్గొన్నారు.

## సివిల్స్ రైట్ డేను నిర్వహించిన అసిస్టెంట్ కలెక్టర్



కూడేరు, మార్చి 1 (అనంత ప్రభ)
కూడేరు మండల పరిధిలోని గొటుకూరు గ్రామపంచాయతీ నందు శుక్రవారం ఎస్సీ కాలనీ యందు సివిల్స్ రైట్స్ డేను అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న శుక్రవారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,, పౌర హక్కుల ద్వారా సమాజంలో ప్రతి ఒక్కరికి సమాన సామాజిక అవకాశాలు ఉన్నాయని తెలిపారు, ప్రతి ఒక్క పౌరుడు తమ హక్కులను పొందాలి అని ప్రజలకు తెలియజేశారు , ప్రతి నెల చివరి దినమున పౌర హక్కుల దినోత్సవం ద్వారా ప్రజలకు హక్కుల గురించి ప్రభుత్వ అధికారులు అవగాహన కనిపిస్తున్నారని తెలిపారు, ఓటు వేయడం న్యాయపరంగా సరైన విచారణ పొందడం ప్రభుత్వ సేవలు పొందడం ప్రభుత్వ విద్యాసంస్థల్లో పిల్లలను చదివించుకోవడం తదితర విషయాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినుత్న, కూడేరు ఇంచార్జ్ తాసిల్దార్ మహబూబ్ భాష,డిప్యూటీ తాసిల్దారు సూర్య ప్రతాప్ యాదవ్, విఆర్వోలు కుల్లాయిస్వామి ,పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ రామానాయుడు, ప్రభుత్వ అధికారులు గొట్టుకూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేసిన జనసేన తోట ఓబులేసు, యువ నాయకులు తోట రామమోహన్



శింగనమల, మార్చి 1 (అనంత ప్రభ)
కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పై జనసేన పార్టీ సింగనమల మండల అధ్యక్షులు తోట ఓబులేసు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పంచాయతీరాజ్ శాఖ కు మరియు అన్నదాత సుఖీభవ,పేదలకు ఆరోగ్య భీమా,తల్లికి వందనం,దీపం పథకం ఇతర పథకాలకు నిధులు కేటాయించడం అదే విధంగా రైతాంగానికి ఉపయోగపడేలా వ్యవసాయ రంగానికి నిధులను కేటాయించడం పట్ల ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జనసేన తోట ఓబులేసు మరియు యువ నాయకులు తోట రామమోహన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహారాష్ట్ర సీఎం సతీమణి అమృత ఫడ్నవీర్ తో బి జి ఎస్ నేత మహేష్ బంజారా



ఉరవకొండ, మార్చి 1 (అనంత ప్రభ)
బంజారా ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రకు సంబంధించి పాటను మహారాష్ట్ర ముఖ్యమంత్రి సతీమణి అమృత ఫణవీర్ ఒక క్యాసెట్ విడుదల చేయడం అభినందనీయమని బంజారా వేషధారణతో విచ్చేసిన ఫడ్నవీరను బంజారాల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు దేశ సంస్కృతిని సేవాలాల్ చరిత్రను దేశవ్యాప్తంగా తెలియజేసేలాగా పాటల రూపంలో క్యాసెట్ విడుదల చేయడం అభినందనీయమని పేర్కొన్నారు

AP 4PG 02 03 2025 SUNDAY qxp_Layout 1 01-03-2025 10:40 PM Page 3











## డయాబెటిస్ ఉందా? అయితే పచ్చి మామిడిని తినడం ప్రారంభించండి



వేసవి వచ్చిందంటే మార్కెట్లో మామిడికాయలు, మామిడి పండ్లు సందడి చేస్తాయి. భారతదేశంలో ప్రజలు అత్యంతగా ఇష్టపడే పండ్లలో మామిడి పండ్లు కూడా ఒకటి. దీనిలో విటమిన్లు, మినరల్స్ డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఆరోగ్యానికి చాలా మంచిది. మండుతున్న వేసవి తాపాన్ని తట్టుకోవడానికి ఈ పోషకాలన్నీ అవసరం. ఎక్కువ మంది మామిడి పండ్లను తినడానికి ఆసక్తి చూపిస్తారు కానీ, పచ్చి మామిడికాయను తినడానికి ఇష్టపడరు. కానీ పచ్చిమామిడిని తినడం కూడా చాలా అవసరం. ఇది శరీరానికి శీతలీకరణాన్ని అందిస్తుంది. వేడి నుంచి తట్టుకునే శక్తిని ఇస్తుంది. దీనిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో ముందుంటుంది. వేసవిలో వచ్చే వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడడానికి శరీరానికి శక్తిని ఇస్తుంది. పచ్చి మామిడికాయలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు పెరుగుతామనే భయం అవసరం లేదు.

డయాబెటిస్ ఉంటే...
మధుమేహంతో బాధపడే రోగులు సీజనల్‌గా దొరికే పచ్చి మామిడికాయల్ని తినడం చాలా అవసరం. దీన్ని తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా డయాబెటిస్ రోగం అదుపులో ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలోనూ, తగ్గించడంలోనూ పచ్చి మామిడికాయ చాలా సహకరిస్తాయి. కాబట్టి వేసవిలో ప్రతిరోజూ పచ్చిమామిడి ముక్కలను తినడం అవసరం.

పచ్చిమామిడి కాయలు తినడం వల్ల మనకు కావాల్సిన రోజువారి విటమిన్ %నూ%లో 10 శాతం ఇది అందిస్తుంది. ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు ఇది చాలా అవసరం. దీనిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. మామిడిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉంటాయి. ఇది రక్తప్రసరణ సవ్యంగా జరగడానికి అవసరం. రక్తప్రసరణ సవ్యంగా జరగడం వల్ల గుండె ఆరోగ్యం బాగుంటుంది. ఈ పోషకాలు రక్తనాళాలు విశ్రాంతి తీసుకోవడానికి కూడా సహాయపడతాయి. అధిక రక్తపోటు రాకుండా అడ్డుకుంటాయి. తక్కువ రక్తపోటు ఉండటం వల్ల గుండెకు మంచిది. ఈ పచ్చి మామిడికాయలో మాంగిఫెరిన్ అని యాక్సిడెంట్ ఉంటుంది. ఇది గుండెకు ఎంతో మేలు చేస్తుంది.

పచ్చి మామిడికాయలో ఒత్తిడిని తగ్గించే పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. పచ్చి మామిడికాయ తినడం వల్ల లుకేమియా, పెద్ద పేగు, ఊపిరితిత్తులు, ప్రొస్టేట్, రొమ్ము వంటి క్యాన్సర్లు రాకుండా ఇది అడ్డుకుంటుంది. పచ్చి మామిడి కాయని ఈ రోజు నుంచే తినడం అలవాటు చేసుకోండి.

## వేసవిలో ఎటువంటి రోగాన్నైనా తగ్గించే అద్భుతమైన హోమ్ రెమిడీస్ చూడండి

వేసవిలో శరీరం అనేక సవాళ్ళని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉష్ణోగ్రత, డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్ వంటి అనేక రకాల సమస్యలకు దారితీస్తుంది. వడదెబ్బ, వేడి దద్దుర్లు సాధారణ సమస్యలు. వీటికి తోడు శ్వాసకోశ సమస్యలు తీవ్రమవుతాయి. వేసవి కారణంగా చెమట రూపంలో సోడియం, పొటాషియం వంటి అవసరమైన పోషకాలు క్షీణించిపోతాయి. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి హైడ్రేట్ గా ఉండటం, కాటన్ వస్త్రాలు ధరించడం, పీక్ అవర్స్ లో ఎండకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఎక్కువ మంది ఈ టైమ్ లో జీర్ణక్రియ, చర్మం సమస్యలు, కాలానుగుణ ఫ్లూ, ఇన్ఫెక్షన్స్ బారిన పడుతూ ఉంటారు. వాటిని ఎదుర్కోవాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలి. అటువంటి సమస్యలను పరిష్కరించగలిగే వంటింటి చిట్కాలు మీ కోసం..

అసిడిటీ కోసం లవంగం

అసిడిటీ సమస్య ఉన్నప్పుడల్లా ఒక లవంగం ముక్కని తీసుకుని చప్పరించండి. లవంగంలో ఉండే సహజ నూనె వల్ల అసిడిటీ సమస్యని తగ్గించడంలో సహాయపడుతుంది.

దగ్గు తగ్గించేందుకు ఖర్జూరాలు

పొడి దగ్గుతో బాధపడుతుంటే మీరు రెమిడీని ప్రయత్నించవచ్చు. 6 ఖర్జూరాలు తీసుకుని అర లీటరు పాలలో 25 నిమిషాల పాటు తక్కువ మంట మీద మరిగించాలి. పాలు బాగా మరిగిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకుని చల్లారనివ్వాలి. ఈ మిశ్రమాన్ని రోజుకి కనీసం మూడు సార్లు తీసుకుంటే మంచిది.

మైగ్రేన్ కోసం యాపిల్

రోజుకొక యాపిల్ తింటే డాక్టర్ కి దూరంగా ఉండవచ్చని అందరూ చెప్తుంటారు. మైగ్రేన్ నొప్పిని తగ్గించడంలో యాపిల్ సహాయపడుతుంది. అయితే దీన్ని ఖాళీ కడుపుతో మాత్రమే తినాలి.

మొటిమలు తగ్గించే దోసకాయ

దోసకాయలో నీరు సమృద్ధిగా ఉంటుంది. ఖనిజాలు, విటమిన్లతో లోడ్ చేయబడి ఉంటాయి. ఇది చర్మానికి మేలు చేస్తుంది. తురిమిన దోసకాయని మెడ, మొహం, కళ్ళపై అప్లై చేసుకోవచ్చు. ఇది మొటిమలు, బ్లాక్ హెడ్స్ ని తొలగించడంలో సహాయపడుతుంది.

దగ్గుకి తులసి
అధిక వేడి కారణంగా చాలా మందికి వేసవిలో వేడి జలుబు చేస్తుంది. దీన్ని తగ్గించుకునేందుకు తులసి చక్కని హోమ్ రెమిడీ. వెల్లుల్లి రసం, తేనె సమాన పరిమాణంలో తీసుకుని అందులో తులసి రసాన్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజుకి మూడు సార్లు తీసుకుంటే దగ్గుని తగ్గిస్తుంది.

అల్సర్ కి తులసి ఆకులు
తులసిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేదంలో ఎన్నో సంవత్సరాలుగా ఉపయోగిస్తున్నారు. ఇందులో యాంటాసిడ్ గుణాలు ఉన్నాయి. రోజుకి కొన్ని తులసి ఆకులు నమిలి మింగితే మంచిది. గ్యాస్ ఉబ్బరం, కడుపులో మంట, అల్సర్లు ఏర్పడకుండా నిరోధించేందుకు సహాయపడుతుంది. ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడంలో దోహదపడుతుంది.



## తేనెలో ఇవి కలిపి రాస్తే నల్ల మచ్చలు మాయం అవుతాయ్..!



తేనెలో అందరికీ అందుబాటులో ఉండేదే. దీనిలో ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. తేనెలో క్యాల్షియం, ఐరన్, సోడియం, ఫాస్ఫరస్, సల్ఫర్, పొటాషియం, విటమిన్ సి, బి వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. తేనె ఆరోగ్యాన్ని రక్షించడానికే కాదు.. సౌందర్య సంరక్షణకు సహాయపడుతుంది. తేనెలోని యాంటీఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు.. చర్మ సంరక్షణకు మేలు చేస్తాయి. సూర్యరశ్మి, హార్మోన్ల మార్పుల, వృద్ధాప్యం కారణంగా.. చాలా మంది మహిళలు డార్క్ స్పాట్స్‌తో బాధపడుతుంటూ ఉంటారు. తేనె నల్ల మచ్చలను తేలికపరచి.. చర్మం రంగుతో సమం చేయడానికి సహాయపడుతుంది. మీరు నల్ల మచ్చలతో బాధపడుతుంటే.. ఈ ఐదు ఫేస్ మాస్క్ మీకు సహాయపడతాయి.

తేనె, నిమ్మరసం ఫేస్ మాస్క్..
ని మ్మరసం వంటి నేచురల్ స్కిన్ లైట్నర్స్ చర్మంపై డార్క్ స్పాట్స్‌ను తగ్గించడంలో సహాయపడుంది. ఈ ఫేస్ మాస్క్‌ను తయారు చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ ఫ్రెష్ లెమన్ జ్యూస్ మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసిన తర్వాత.. 15 నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత గోరువెచ్చని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే.. మంచి రిజల్ట్స్ ఉంటాయి.

తేనె, పసుపు ఫేస్ మాస్క్..
పసుపులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలు మంటను తగ్గిస్తాయి, చర్మ సమస్యలను నయం చేస్తాయి. ఈ ఫేస్ మాస్క్ చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనెకు చిటికెడు పసుపు పొడి కలిపి మిశ్రమాన్ని తయారు చేయండి. ఆ తర్వాత ముఖానికి అప్లై చేసి.. 10 – 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. ముఖంపై నల్లటి మచ్చలు తొలగుతాయి.

తేనె, దాల్చిన చెక్క ఫేస్ మాస్క్..
దాల్చినచెక్కలో యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉంటాయి. మొటిమలతో బాధపడేవారికి దాల్చిన మంచి మెడిసిన్ అనొచ్చు. అంతేకాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరచి.. డార్క్ స్పాట్స్‌ను తగ్గిస్తుంది. ఈ ఫేస్ మాస్క్ తయార చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనెలో చిటికెడు దాల్చిన చెక్క పొడి వేసి.. మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసి 10 నుంచి 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. మంచి రిజలట్స్ కోసం వారానికి రెండు సార్లు అప్లై చేయండి.

తేనె, బొప్పాయి ఫేస్ మాస్క్..
బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి, డార్క్ స్పాట్స్ రూపాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. పండిన బొప్పాయి గుజ్జు ఒక టేబుల్ స్పూన్ తీసుకుని, దానిలో తేనె కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేసుకోండి. ఈ మిశ్మాన్ని ముఖానికి అప్లై చేసి.. 15 – 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. మంచి రిజల్ట్స్ కోసం.. వారానికి ఒక సారి ఈ మాస్క్ అప్లై చేసుకోండి.

తేనె, కలబంద ఫేస్ మాస్క్..
కలబందలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు డార్క్ స్పాట్స్‌తో సంబంధం ఉన్న ఎరుపు, మంటను తగ్గిస్తాయి. దీనిలో చర్మానికి పోషణ ఇచ్చే.. విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఒక టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ కలబంద గుజ్జు మిక్స్ చేసి పేస్ట్‌లా చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి.. 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. డార్క్ స్పాట్స్ మాయం అవుతాయి.

## ఆరుబయట నిద్రపోతే ఎన్ని ప్రయోజనాలో తెలుసా? డోన్ట్ మిస్!

ఆరు బయట నిద్రపోవడం చాలామందికి ఇష్టం. ఎంత మంచి జ్ఞాపకమో అంటూ ఫ్లాష్ బ్యాక్ కి వెళ్లిపోతారు కూడా. అప్పట్లో వేంము అని కథలుగా చెప్పే నడివయస్కులు మీకూ తెలిసే ఉంటారు. ఇప్పుడంటే అంతా ఏసి రూములకు అలవాటయ్యారు. కానీ ఇది వరకు వేసవి వచ్చిందంటే అందరూ ఆరుబయటో, డాబామీదో పడుకునేవారు. నీలాకాశం చూస్తూ నిద్రపోయే అదృష్టం ఈ జెనరేషన్ జనాలకు లేదు మరి. అప్పుడు ఉక్కపోత భరించలేక ఆరుబయట పడుకునే వారు. కానీ అదే ఆరోగ్యానికి మంచిదని కొత్తగా అధ్యయనాలు జరిపి రుజువులు చూపుతున్నారు శాస్త్రవేత్తలు.

ఏ సంఘటన బాధించి డిప్రెషన్ వచ్చేసినా కాసేపలా బయట పడుకుని ఆకాశం వంక చూడమని చెబుతున్నారు మానసిక నిపుణులు. అలా ఆరుబయట గడపడం మనసుకు ఉల్లాసం, శరీరానికి ఆరోగ్యం ఇస్తుందట. ఈ అపార్టుమెంటుల్లో ఆరు బయటకెక్కడికి వెళ్లేదీ అనకండి. సరదాగా అప్పుడప్పుడు కాంపింగులకైనా వెళ్లాలని సలహా ఇస్తున్నారు ఎక్స్ పర్ట్స్.

ఆరుబయట నిద్రపోతే సర్కాడియన్ రిథమ్ సమయం రెండు గంటలు వెనక్కి వెళ్లిందని ఈ మధ్యే జరిపిన ఒక అధ్యయనం ద్వారా నిరూపితమైందట. అంటే మీరు రెండు గంటల ముందుగానే నిద్ర లేచేస్తారన్న మాట. సర్కాడియన్ రీసెట్ అనేది శరీరం అలవాటు పడిన నిద్రా చక్రాన్ని మార్చడమని అర్థం. ఈ సర్కాడియన్ రిథమ్ మీద కాంతి, ఉష్ణోగ్రత వంటి రకరకాల కారణాలు ప్రభావం చూపుతాయి.

ప్రస్తుతం మన చుట్టూ పరిసరాల్లో అంతులేనంత ఆర్టిఫిషియల్ లైట్ ఉంది. ఆరుబయట సమయం గడపడం అంటే ఈ ఆర్టిఫిషియల్ లైట్ కి దూరంగా ఉండడం అని అర్థం. ఇంట్లో బెడ్ రూమ్ లో ఒక్కరే పడుకుంటారు. లేదా ఇద్దరుంటారు. అందులో ఒకరు నిద్ర పోవడమో లేక ఎవరి ఫోన్లు వారు చూస్తుండటమో చేస్తుంటారు. ఇలా కాకుండా ఆరుబయట బృందంగా అప్పుడప్పుడు పడుకుంటే కబుర్లలో సమయం గడుస్తుంది. తెలియకుండానే కన్నుమలిగి ప్రయత్నం లేకుండానే నిద్ర పట్టేస్తుంది. ఇది మనస్సు, శరీరం రెండూ రెజువనేట్ అయ్యేందుకు ఒక మంచి అవకాశమని అద్యయనాలు చెబుతున్నాయి.

ఒత్తిడి లేని జీవితాలు ఈ రోజుల్లో అంత సులభం కాదు. రోజులో దాదాపుగా 8,10 గంటల పాటు తీవ్రమైన ఒత్తిడిలోనే సగం జనాభా బతికేస్తున్నారు. ఇది నాడీవ్యవస్థ మీద, మెదడు పనితీరు మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. అనుక్షణం ఏదో ఒక యంత్ర శబ్ధంలోనే సమయం గడుపుతున్నాం మనం. అలాకాకుండా ప్రకృతిలోని సహజమైన శబ్దాల నడుమ, బహిరంగ ప్రదేశాల్లో గడిపినపుడు మన శరీరంలో కార్టిసాల్ స్థాయి గణనీయంగా తగ్గడాన్ని గమనించారట. జర్నల్ ఎన్విరాన్మెంట్ అండ్ బిహేవియర్ లో చెట్లను చూస్తే ఒత్తిడి తగ్గడాన్ని గుర్తించినట్లు ఒక అధ్యయన ఫలితాలుగా ప్రచురించారు.

అర్ధరాత్రి వీచే చల్లని గాలిని ఏ ఏసి గాలితోనూ పోల్చలేము. ఇలా ఆరుబయట గడిపే సమయం చాలా మంచిదని మానసిక, శారీరక ఆరోగ్యాన్ని అందిస్తుందని పరిశోధనలు పునరుద్ఘాటిసత్నాయి. అందుకే వేసవిలో ఒక వారం పాటు అలా ఊరెళ్లి ఆరుబయట పడుకోవడం బెటర్. లేదంటే క్యాంపింగ్ చేసుకోవచ్చు కూడాను.



AP 4PG 02 03 2025 SUNDAY qxp_Layout 1 01-03-2025 10:40 PM Page 4



# స్విమ్ సూట్‌లో సాక్షి అగర్వాల్.. నెవ్వర్ బిఫోర్ గ్లామర్ షోతో బిగ్‌బాస్ బ్యూటీ..!



మెగా రియాలిటీ షో బిగ్‌బాస్ ద్వారా పాపులర్ అయిన నటీనటులు మనదేశంలో ఎంతో మంది ఉన్నారు. వీరిలో అందాల భామ సాక్షి అగర్వాల్ కూడా ఒకరు. నటనతో పాటు అందంతోనూ ఈ అమ్మడు సెగలు రేపుతుంటారు. తమిళనాట క్రేజీ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న సాక్షి అగర్వాల్.. సోషల్ మీడియాలో హాట్ హాట్ ఫోటో షూట్‌లతో టాప్ లేపుతుంటారు. తాజాగా ఆమె చేసిన ఫోటో షూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వివరాల్లోకి వెళితే..

20 జూలై 1990న ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లో జన్మించిన సాక్షి అగర్వాల్ చెన్నై, బెంగళూరులలో చదువుకున్నారు. అనంతరం మార్కెటింగ్ కన్సల్టెంట్‌గా కెరీర్ ప్రారంభించిన సాక్షి మాలిక్.. తొలుత టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టీసీఎస్‌లో ఉద్యోగం చేశారు. అయితే ఓ ఛారిటీ షో కోసం మోడలింగ్ చేస్తున్న క్రమంలో ఆమె ప్రతిభను గుర్తించిన దర్శకులు పలు వాణిజ్య ప్రకటనల్లో అవకాశాలిచ్చారు. ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ సూర్యతో కలిసి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కు చేసిన యాడ్ ఫిల్మ్ సాక్షి కెరీర్‌ను మలుపు తిప్పింది.

2013లో ఉద్యోగానికి స్వస్తి చెప్పిన సాక్షి మాలిక్.. నటిగా స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. తొలుత మ్యూజిక్ ఆల్బమ్స్‌లో నటించిన సాక్షి.. నయనతార – ఆర్యలు నటించిన రాజారాణిలో ఓ చిన్న పాత్రలో మెరిశారు. ఆ తర్వాత కన్నడలో సాఫ్ట్‌వేర్ గండ, యూగన్, తిరుట్టు వీసీడీ తదితర చిత్రాల్లో నటించారు. ఈ క్రమంలో కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన కాలాలో ఆయనకు కూతురిగా అలరించింది. అనంతరం విశ్వాసం, సిండ్రెల్లా, అర్నామనై 3, భఘీరా తదితర చిత్రాల్లో సాక్షి నటించారు. 12 ఏళ్ల కెరీర్‌లో తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో నటించారు సాక్షి అగర్వాల్. ప్రస్తుతం ఆమె గెస్ట్ చాప్టర్ 2, ది నైట్ చిత్రాల్లో నటిస్తున్నారు.

తమిళ బిగ్‌బాస్ సీజన్ 3లో కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన సాక్షి అగర్వాల్ .. తన మైండ్ , అందంతో హౌస్‌కు గ్లామర్ సోగసులు అద్దారు. దాదాపు 49 రోజుల పాటు బిగ్‌బాస్ హౌస్‌లో ఉన్న సాక్షి తుది వరకు వెళ్లలేకపోయారు. అయితే బిగ్‌బాస్ ద్వారా ఆమె బుల్లితెర ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే తన చిన్ననాటి స్నేహితుడు నవనీత్‌తో ప్రేమలో పడి, ఆయనను పెళ్లి చేసుకున్నారు సాక్షి. ఈ ఏడాది జనవరి 2న గోవాలోని ఓ విలాసవంతమైన హోటల్‌లో జరిగిన వీరి పెళ్లి వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించింది. ప్రస్తుతం భర్తతో కలిసి హనీమూన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు సాక్షి అగర్వాల్.

సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే సాక్షి అగర్వాల్.. ఎప్పటికప్పుడు తన సినిమాలు, షోలు, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజాగా బ్లాక్ కలర్ స్విమ్ సూట్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి ఇంకేందుకు ఆలస్యం సాక్షి అందాలపై మీరూ ఓ లుక్కేయండి.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేర–వైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పు–రస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యురిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# వెంటాడుతోన్న గేమ్ ఛేంజర్.. దిల్‌రాజుపై కేసు, 350 మంది మూకుమ్మడిగా






గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ – క్రియేటివ్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన గేమ్ ఛేంజర్ ఎన్నో అవాంతరాలను దాటుకుని సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. అయితే మిక్స్‌డ్ టాక్ కారణంగా ఈ సినిమా దారుణ పరాజయాన్ని మూటకట్టుకుంది. అయినప్పటికీ చరణ్ – శంకర్ క్రేజ్‌తో పడుతూ , లేస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అయితే నిర్మాత దిల్‌రాజ్‌కు ఇప్పటికీ గేమ్ ఛేంజర్ షాకుల మీద షాకులిస్తోంది.

గేమ్ ఛేంజర్ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ ముద్దుగుమ్మ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, అంజలి , ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, సునీల్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దాదాపు రూ.450 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో గేమ్ ఛేంజర్ నిర్మించారు దిల్‌రాజు. ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత రామ్ చరణ్ నటిస్తున్న సినిమా కావడంతో పాటు దిగ్గజ దర్శకుడు శంకర్ తన కెరీర్‌లోనే తొలిసారిగా ఓ స్ట్రెయిట్ తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించిన నేపథ్యంలో గేమ్ ఛేంజర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

అయితే మార్నింగ్ షో నుంచే మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న గేమ్ ఛేంజర్‌కు సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం మరింత దెబ్బ తీసింది. కొందరైతే ఏకంగా గేమ్ ఛేంజర్ హెచ్‌డీ ప్రింట్‌ను తీసి ఆన్‌లైన్‌లో స్ట్రీమింగ్ చేయడంతో ఈ సినిమాపై భారీ ఎఫెక్ట్ పడింది. ఇక సినిమా ఫస్ట్ డే కలెక్షన్స్ విషయంలోనూ దుమారం రేగింది. కావాలని ఫేక్ కలెక్షన్స్ వేశారంటూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిసింది. ఈ సినిమాతో నిర్మాత దిల్‌రాజ్ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు.

గత కొన్నేళ్లుగా సరైన హిట్ లేని దిల్‌రాజు.. ఖర్చుకు వెనుకాడకుండా గేమ్ ఛేంజర్‌ను నిర్మించారు. అయితే ఈ సినిమా అనుకున్న స్థాయిలో సక్సెస్ కాకపోగా ఆయనను పీకల్లోతు అప్పుల్లో ముంచెత్తిందని ఫిలింనగర్ టాక్. మూలిగే నక్క మీద తాటికాయ పడిన చందంగా దిల్‌రాజు నివాసం, కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించడం టాలీవుడ్‌లో కలకలం రేపింది. అయితే ఇదే సంక్రాంతికి అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం లాభాల పంట పండించడంతో దిల్‌రాజు కాస్తంత కోలుకున్నారు.

తాజాగా ఈ స్టార్ ప్రొడ్యూసర్‌కు మరో గట్టి షాక్ తగిలింది. తమకు ఇవ్వాల్సిన పేమెంట్ ఇవ్వలేదంటూ దిల్‌రాజుపై కొందరు జూనియర్ ఆర్టిస్టులు కేసు పెట్టారు. గేమ్ ఛేంజర్ సినిమాలో పనిచేసేందుకు 350 మంది ఆర్టిస్టులు హైదరాబాద్‌కు వచ్చారు. వీరికి రోజుకు రూ.1200 చొప్పున పేమెంట్ ఇస్తామని కో డైరెక్టర్ స్వర్గం శివ హామీ ఇచ్చారట. అయితే సినిమా రిలీజై రోజులు గడుస్తున్నా నేటి వరకు ఆ డబ్బులు చెల్లించకపోవడంతో ఈ 350 మంది జూనియర్ ఆర్టిస్టులు పోలీస్ స్టేషన్ మెట్లెక్కి తమకు న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారం ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మరి దీనిపై దిల్‌రాజు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# ఛావా ఫస్ట్ రివ్యూ.. రష్మిక మందన్న ఫెర్ఫార్మెన్స్ ఎలా ఉందంటే?

నేషనల్ క్రష్ రష్మిక మందన్న, మోస్ట్ టాలెంటెడ్ హీరో వికీ కౌశల్ జంటగా రూపొందిన చిత్రం ఛావా. మరాఠా కింగ్ చత్రపతి సంభాజీ మహారాజ్ జీవితంలో జరిగిన కీలక సంఘటనల ఆధారంగా రూపొంది ఈ సినిమాకు లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఫిబ్రవరి 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్నది. ఈ క్రమంలో ఈ సినిమాపై ప్రముఖ క్రిటిక్ తనదైన శైలిలో రివ్యూ అందించారు. ఈ సినిమాపై సినీ విమర్శకుడు విశ్లేషణ ఏందనే వివరాల్లోకి వెళితే..

ఛావా సినిమా విషయానికి వస్తే.. శివాజీ సాంత్ రచించిన మరాఠీ నవల ఛావా ఆధారంగా తెరకెక్కింది. ఈ సినిమాను దినేష్ విజన్ నిర్మాణ సారథ్యంలో మడోక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ మూవీకి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో ఛత్రపతి సంభాజీ మహారాజ్‌గా వికీ కౌశల్, మహరాణి యేసుభాయ్‌గా రష్మిక మందన్న, ఔరంగజేబ్‌గా అక్షయ్ కుమార్,అశుతోష్ రాణా, దివ్య దత్తా, దయాన పెంటీ తదితరులు నటిస్తున్నారు.

చారిత్రాత్మక నేపథ్యంగా రూపొందిన ఛావా సినిమాను అత్యంత భారీగా నిర్మించారు. భారీ సెట్స్, పురాతన కాలం క్యాస్ట్యూమ్స్‌ను డిజైన్ చేశారు. అలాగే టాప్ యాక్టర్లు, టెక్నిషియన్స్ పనిచేశారు. అలాగే దేశవ్యాప్తంగా ఈ సినిమాను క్రేజీగా ప్రమోట్ చేశారు. దాంతో ఈ సినిమా బడ్జెట్ భారీగా పెరిగిపోయింది. ఈ సినిమాను సుమారుగా 130 కోట్ల రూపాయలతో నిర్మించినట్టు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.

ఛావా చిత్రాన్ని దుబాయ్‌కు చెందిన క్రిటిక్ ఉమేర్ సంధూ సెన్సార్ ప్రీమియర్‌ను చూసి తన రివ్యూను అందించారు. రష్మిక నటించిన ఈ సినిమా యావరేజ్‌గా కూడా లేదు అని షాకింగ్ కామెంట్ చేశాడు. ఈ మూవీ చాలా లౌడ్‌గా, ఇరిటేటింగ్‌గా ఉంది అని కామెంట్ చేశాడు. ఇంకా ఈ సినిమా అంతగా ఆకట్టుకొనేలా ఉండదనే విధంగా ట్వీట్లు చేస్తున్నాడు.

ఛావా సినిమాలో వికీ కౌశల్ పెర్ఫార్మెన్స్ డిజాస్టర్. రాజుల వేషంతో బాగా కనిపించడం లేదు. రష్మిక మందన్న ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్. హిస్టారికల్ స్క్రిప్టులో బూతులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. చరిత్రను వక్రీకరించి సినిమాను రూపొందించారు. ఓవరాల్‌గా ఈ సినిమా యావరేజ్‌గా కూడా లేదు. వీఎఫ్ఎక్స్ వర్క్ నాసిరకంగా ఉంది అంటూ ఉమేర్ సంధూ తనదైన శైలిలో తన రివ్యూను పోస్టు చేశారు.

అయితే ఉమేర్ సంధూ ఇచ్చే రివ్యూలు అంచనాలకు దూరంగా ఉంటాయి. ఎక్కువగా కొందరిని టార్గెట్ చేసి రివ్యూ ఇస్తారనే వాదన సోషల్ మీడియాలో ఉంది. ఈ క్రమంలో ఛావాపై ఆయన ఇచ్చిన రివ్యూను జాగ్రత్తగా పరిశీలస్తున్నారు. ఈ మూవీ ఎలా ఉంటుందనేది సినిమా రిలీజ్ తర్వాతే తెలుస్తుంది. థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్ ఉన్న సినిమా అనే ఫీలింగ్‌ను ట్రైలర్లు, ప్రమోషనల్ కాంటెంట్ ద్వారా స్పష్టమైంది.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com